జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 9 | అక్టోబర్ | 2025 • పేజీలు : 5



## కాంట్రాక్టు కార్మికులకు
# మెరుగైన వైద్యమే సింగరేణి లక్ష్యం

- ఈఎస్ఐ కోసం సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు
- జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం కవిత నాయుడు



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 8, ప్రజా జ్యోతి :** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రా క్టు కార్మికులకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో సంస్థ ముందుకుసాగుతోందని సింగరేణి జీఎం(పర్సనల్) ఐఆర్ అండ్పీఎం కవితానాయుడు అన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసే

మిగతా 2 లో...



## ట్రెండింగ్...

2 లో..

# రిజర్వేషన్...!

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

- బీసీ రిజర్వేషన్ల చుట్టూ రాజకీయ గందరగోళం
- హైకోర్టు తీర్పుపైనే రాష్ట్ర ఉత్కంఠ
- గవర్నర్ వద్దే నిలిచిన కీలక ఫైల్
- గోడగా మారిన 50 శాతం పరిమితి
- మహారాష్ట్ర ఉదంతం తెలంగాణకు హెచ్చరిక
- సుప్రీంకోర్టు సవాల్ కి దారితీసే నిర్ణయం
- న్యాయస్థానాల దిశే ఇప్పుడు భవితవ్యం
- దేశ, రాష్ట్ర రాజకీయాల హాట్ టాపిక్..
- ట్రెండింగ్ అంశం పై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం

తెలంగాణలో ఇప్పుడు అత్యధికంగా వినిపిస్తున్న పదం "రిజర్వేషన్". రాష్ట్రంలో ఈ వివాదం రోజురోజుకీ ముదురుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అంచున నిలబడి ఉండగా, రిజర్వేషన్ లెక్కల గందరగోళమే ప్రభుత్వానికి ప్రధాన అడ్డంకిగా మారింది. హైకోర్టు తీర్పు కోసం రాష్ట్రం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వేళ, ఈ అంశం చుట్టూ మహారాష్ట్రలో గతంలో చోటుచేసుకున్న సంఘటనలు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి. దీంతో ప్రజా వేదికల నుండి పల్లె చాటువరకు ఒకే చర్చ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అవుతుందా ? సాధ్యమా? చట్టబద్ధమా? అని. ప్రస్తుతం ఈ అంశం కోర్టు, రాజ్ భవన్, ప్రభుత్వ భవనాలు, దేశ రాజకీయ వేదికలు అన్నింటినీ కదిలిస్తోంది. ఇప్పుడు ఇదే దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ట్రెండింగ్ టాపిక్గా మారింది. ఈ తరుణం లో ప్రజజ్యోతి దీనిపై అందిస్తున్న విశ్లేషణాత్మకమైన కథనం.

# 16 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయిన వారిలో ఏడుగురు మహిళలు, 9 మంది పురుషులు
- లొంగిపోయిన మావోయిస్టులపై 70 లక్షల రివార్డ్



**చర్ల, అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్ గఢ్ లోని నక్సల్ ప్రభావిత నారాయణపూర్ జిల్లాలో కొనసాగుతున్న నక్సల్ నిర్మూలన ప్రచారంలో భాగంగా బుధవారం 70 లక్షల రివార్డు ఉన్నవారితో సహా మొత్తం 16 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో 9 మంది పురుషులు , ఏడుగురు మహిళా నక్సలైట్లు ఉన్నారు. లొంగిపోయిన వారిలో డిప్యూటీ కమాండర్ స్థాయి నక్సలైట్ కూడా ఉన్నాడు అతను అనేక ప్రధాన సంఘటనలలో పాల్గొన్నాడు. నారాయణపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) రాబిన్సన్ గుడియా లొంగుబాటును ధృవీకరిస్తూ లొంగిపోయిన నక్సలైట్లందరూ చాలా కాలంగా పోలీసులకు భద్రతా దళాలకు

మిగతా 2 లో...


# ప్రకాష్ నగర్ అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** కొత్తగూడెంలో నీ ప్రకాష్ నగర్ అంగన్ వాడీ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలు విధానాలను సమీక్షించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పిల్లలకు సమయానికి ఆహారం, పాలు, గుడ్లు అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అందించే పోషకాహార పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా అనే విషయంపై అక్కడ సిబ్బంది నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ భవనం పరిశుభ్రత, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, నేర్చుకునే సామగ్రి వాడకం తదితర అంశాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అంగన్ వాడీ కేంద్రం బాలల సమగ్రాభివృద్ధికి కేంద్రబిందువుగా మారాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక అదృష్టం పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అంగన్వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వైద్యమే సింగరేణి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)



కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ పథకం అమలు చేసేందుకు సింగరేణి హెడ్డాఫీస్ కాన్ఫిరెన్స్ హాల్లో కొత్తగూడెం రీజియన్లోని కొత్తగూడెం ఏరియా, కార్పోరేట్ పరిధిలోని కాంట్రాక్టర్లకు, కాంట్రాక్టర్ల ఉద్యోగులకు సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ చైర్మన్, ఎండీ బలరాం చొరవతో సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించబోతున్నామన్నారు. ఇందులో భాగముగా ముందుగా కొత్తగూడెం రీజియన్ లోని కార్పొరేట్ మరియు కొత్తగూడెం ఏరియాల నాన్-మైనింగ్ కాంట్రాక్టు కార్మికులకు పైలట్ ప్రాజెక్టు కింద ఈ ఎస్ ఐ సదుపాయం కల్పించటానికి కాంట్రాక్టర్లకు మరియు కాంట్రాక్టర్ల ఉద్యోగులకు సభ్యత్వ రిజిస్ట్రేషన్ నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ ఈ ఎస్ ఐ పథకం లో సభ్యత్వం పొందుటకు కాంట్రాక్ట్ ఉద్యోగుల నెల జీతం 21,000 లోపు ఉండాలని, అదే విధముగా మొదటి దశ సభ్యత్వ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 10లేదా అంతకంటే ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులు గల కాంట్రాక్టర్ల కు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని, రెండవ దశలో 10 మంది కంటే తక్కువ కాంట్రాక్టు ఉద్యోగులు గల కాంట్రాక్టర్ల కు కూడా అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ ఈ ఎస్ ఐ పథకం ద్వారా కాంట్రాక్టు కార్మికులకు వైద్య సదుపాయం తో పాటు భీమా సౌకర్యం కూడా ఉంటుంది అని కావున ఈ సదుపాయాన్ని కాంట్రాక్టర్ల ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇంకా నాన్-మైనింగ్ లో పని చేస్తున్నపై ఉదహరించిన అర్హతలు కలిగిన కాంట్రాక్టర్లకు మరియు కాంట్రాక్టర్ల ఉద్యోగులువారి సంబందిత నోడల్ అధికారులతో సంప్రదించి ఈ రిజిస్ట్రేషన్సదవకాశాన్ని సద్వినియోగ పరచుకొనవలసినదిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ ఎస్ ఐ సి అధికారులు మరియు సంబందిత ఏరియాల అధికారులు మరియు సిబ్బంది ఈ ఎస్ ఐ వెబ్ పోర్టల్ నందు కాంట్రాక్టర్లకు మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల సభ్యత్వాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం(పర్సనల్) కే.అజయ్ కుమార్, డిజిఎం (పర్సనల్) వై.వి.ఎల్. వరప్రసాద్, జి వి మోహన్ రావు, ఖమ్మం ఈఎస్ఐ సి బ్రాంచ్ మేనేజర్ జి.సాయి కుమార్, డి వై. పి ఎం నరేన్ చక్రవర్తి, అధికారులు, కాంట్రాక్టర్లు మరియు కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## 16 మంది మావోయిస్టులు లొంగుబాటు







(మొదటి పేజీ తరువాయి...)

తలనొప్పిగా ఉన్నారని అన్నారు. వారందరూ వివిధ నక్సలైట్ గ్రూపులతో సంబంధం కలిగి ఉన్నారు అని నారాయణపూర్, అబుజ్మద్, ఓర్చా మరియు బస్తర్ ప్రాంతాలలో చురుకుగా ఉన్నారు అని అన్నారు .లొంగిపోయిన నక్సలైట్లు చాల సంవత్సరాలుగా పోలీసు దళాలు, గ్రామస్తులపై దాడులు మందుపాతర పేలుళ్లు హత్యలు వంటి తీవ్రమైన సంఘటనలలో పాల్గొన్నారు. ఈ నక్సలైట్లలో చాలా మందికి ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం ప్రకటించిన 70 లక్షల రూపాయల వరకు రివార్డ్ కలిగి ఉన్నారు . లొంగిపోవడానికి ప్రధాన కారణం పోలీసుల లోన్ వర్రాటు ప్రచారం జన జీవన స్రవంతిలోకి తిరిగి వచ్చిన నక్సలైట్లకు పునరావాస విధానం అని అధికారులు తెలియచేసారు .పోలీసు అధికారుల ప్రకారం అడవుల్లో నిరంతరం పెరుగుతున్న ఒత్తిడి భద్రతా దళాల చురుకుదనం అభివృద్ధి నక్సలైట్లు తమ ఆయుధాలను వదులుకోవలసి వచ్చింది అని లొంగిపోయిన నక్సలైట్లందరికీ ప్రభుత్వ పునరావాస విధానం కింద సహాయం రక్షణ అందించబడుతుందని పోలీస్ సూపరింటెండెంట్ రాబిన్సన్ గుడియా పేర్కొన్నారు. సంస్థ యొక్క ప్రస్తుత స్థితి దాని నెట్ వర్క్ గురించి కీలకమైన సమాచారాన్ని పొందడానికి లొంగిపోయిన తర్వాత నక్సలైట్లను విచారిస్తున్నామని కూడా ఆయన పేర్కొన్నారు.లొంగిపోయిన నక్సలైట్లలో ఒకరైన డిప్యూటీ కమాండర్, భద్రతా దళాలపై దాడులు, ఐ ఈ డి పేలుళ్లు గ్రామస్తుల హత్య వంటి తీవ్రమైన నేరాలతో సహా అనేక క్రిమినల్ అభియోగాలను ఎదుర్కొంటున్నాడు. ఈ లొంగుబాటు నారాయణపూర్ ప్రాంతంలో నక్సలైట్ నెట్ వర్క్ ను బలహీనపరచడమే కాకుండా స్థానిక స్థాయిలో భద్రతా దళాలకు గణనీయమైన ఉపశమనం కలిగించిందని పోలీసులు పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా పోలీసులు సీఆర్ పీ ఎఫ్ దళాలు నక్సలైట్లపై అనేక విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించి ప్రధాన నక్సలైట్ స్థావరాలను నాశనం చేయడంతో ఇది బస్తర్ రేంజ్ కు పెద్ద విజయమని అధికారులు అన్నారు . అడవులపై నక్సలైట్ సంస్థ పట్టు బలహీనపడుతుండటం ప్రభుత్వ పునరావాస విధానం యొక్క ప్రభావాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నందున రాబోయే రోజుల్లో మరికొంతమంది నక్సలైట్లు లొంగిపోయే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

## టెలిగ్రామ్ యాప్ క్లిక్ తో రూ.1.25 లక్షలు మాయం



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 8, ప్రజా జ్యోతి** పాల్వంచ మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మాలోత్ పవన్, తన సెల్ఫోన్లో వచ్చిన టెలిగ్రామ్ యాప్ను పలుమార్లు క్లిక్ చేయడంతో రూ.40 వేలు, మరోసారి రూ.20 వేలు చొప్పున మొత్తం రూ.1.25 లక్షలు తన ఖాతాలోంచి పోగొట్టుకున్నాడు. దీంతో పవన్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేశ్ తెలిపారు.

## ఘనంగా ప్రారంభమైన జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ 69వ పాఠశాలల క్రీడలు

- క్రీడా పోటీలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో గెలుపొంది జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి-
- కలెక్టర్ జితేష్ వి పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 8, ప్రజా జ్యోతి** కొత్తగూడెం ప్రకాశం మైదానం నందు 69 వ ఎస్ జి ఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి, ఈ క్రీడ పోటీలను భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ప్రారంభించిన అనంతరం కలెక్టర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు, క్రీడాకారులకు గెలుపోటములు సహజమని విజేతలైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు, అదేవిధంగా ప్రతి క్రీడాకారుడు క్రీడల ద్వారానే బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా డివైఎస్ఓ ద్వారా తనను సంప్రదించాలని క్రీడాకారులను కోరారు, నేడు , రేపు జరిగే పోటీలలో భాగంగా బుధవారం 17 సంవత్సరాల విభాగంలోని బాలబాలికలకు అదేవిధంగా గురువారం 14సంవత్సరాలలోపు బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో , అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, తరువాత ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని ఎస్ జి ఎఫ్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్ కుమార్ తెలిపారు ,ఈ పోటీలలో డి వై ఎస్ ఓ పరంధామ రెడ్డి, డిసిసిబి సెక్రెటరీ నీరజ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులైన ప్రేమ్ కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ అంపైర్లు గా వ్యవహరించారు

## భద్రాచలం హెడ్ కానిస్టేబుల్ కు ఎఎస్సైగా ఉద్యోగోన్నతి





**భద్రాచలం, అక్టోబరు 8,ప్రజాజ్యోతి :** భద్రాచలం పోలీసు స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న జి. భాస్కర్ కు ఎఎస్సైగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సమయంలో పుష్పగుచ్ఛం అందజేసారు. అలాగే భద్రాచలం ఇండస్ట్రియల్ అసోసియేషన్ తరపున కోపనాపతి శాంతారావు, మల్లాడి చక్రి ,పట్టణ ప్రముఖులు భూక్యా బాల్య ,చేతన మీసేవ నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ లు అభినందనలు తెలిపారు.

## టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ లోకి పలువురు కార్మికుల చేరిక




**పాల్వంచ (రూరల్),అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-142) లోకి పలువురు కార్మికులు చేరారు.కేటీపీఎస్ ఏ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ రామారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సంఘాన్ని బలోపేతం చేయడంలో కృషి చేస్తున్న ప్రాంతీయ నాయకులను అభినందించారు.చేరికలలో భాగంగా కేటీపీఎస్ 5, 6, 7వ దశలలోని ఉద్యోగులు వి.రాజు (జెపిఏ),జి.మౌనిక (జెపిఏ),పి.స్రవంతి(జెపిఏ), ఎం.సుభద్ర (జెపిఏ),జి.లాల్ (ఆర్టిజన్)లకు యూనియన్ కండువాలు కప్పి సభ్యత్వ రసీదులను అందించారు.నూతనంగా సంఘంలోకి చేరిన కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.శ్రీనివాస చారి,వెంపటి వెంకటేశ్వర్లు,తోలెం కోటేశ్వరరావు,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు బీఎస్పీ పార్టీ సిద్ధం

- బీఎస్పీ చర్ల మండల అధ్యక్షుడు కొండా కౌశిక్



**చర్ల, అక్టోబర్ ం8: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం మండల కేంద్రంలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంనిర్వహించారు . ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ చర్ల మండల అధ్యక్షులు కొండా కౌశిక్ పాల్గొని మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల పరిధిలోని (12 )ఎంపీటీసీ (1)జడ్పీటీసీ స్థానాలకు అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని పార్టీ ఏనుగు గుర్తు మీదనే పోటీ చేస్తామన ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల నీతి నిజాయితీగా సమస్యల పరిష్కారం కై కొట్లాడే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని ఇట్టి విషయం సమస్త మండల ప్రజానీకానికి తెలియనిది కాదని దీనిని ప్రజలు మరో సారి గుర్తించి బహుజన సమాజ్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, లు గా నిలబడుతున్న అభ్యర్థులను ఆశీర్వదించి అధికారాన్ని ఇవ్వాలని ఆయన మండల ప్రజానీకాన్ని కోరారు.బహుజన జాతీ బిడ్డలు అందరు ఒక్కటైతేనే బహుజన రాజ్యం సాధ్యమౌతుందని తద్వారానే బానిసత్వం పోతుందని తద్వారానే డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి ఆశయ సాధన నెరవేరుతుందని అన్నారు .ఈ ప్రాంతంలో కాంగ్రెస్, బి ఆర్ ఎస్, పార్టీలు దశాబ్దాల కాలంగా అధికారంలో వున్నప్పటికి అభివృద్ధి సూన్యం అని అయన స్పష్టం చేశారు. ఇట్టి విషయాన్ని చర్ల మండల ప్రజానీకం గమనించాలని బహుజన సమాజ్ పార్టీ ప్రజల యొక్క సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని బహుజన సమాజ్ పార్టీకి అధికారం ఇస్తే తప్ప ఈ ప్రాంతం అభివృద్ధికీ నోచుకోదని అయన అన్నారు. బహుజన సమాజ్ పార్టీ ఎంపీటీసీ జడ్పిటిసి అభ్యర్థులను గెలిపించాలని ఆయన మరోసారి చర్ల మండల ప్రజానీకానికి పిలుపునిచ్చారు.బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతం నచ్చి పార్టీ కార్యక్రమాల పట్ల ఆకర్షితుడై సింగసముద్రం గ్రామ నివాసి సోయం శ్రీమూర్తులు పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కొండ కౌశిక్ ఆయనకు పార్టీ కండువా కప్పి గౌరవంగా పార్టీలకు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, కార్యదర్శి గుర్రాల విజయ్,కోశాధికారి భాష, పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ చెన్నం పవన్, పార్టీ మండల నాయకురాలు ఈ సి మెంబెర్ పంబీ కుమారి, ములకల సాయి, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



**టేకులపల్లి,అక్టోబర్08, ప్రజాజ్యోతి:** గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బద్దుతండ, స్టేషన్ తడికలపూడి, గుండ్లమాడు,రోడ్డు గుంపు ల లో వైద్య సిబ్బందిచే వైద్య శిబిరాలు నిర్వహించి, గ్రామస్తులకు మలేరియా, డెంగ్యూ, షుగర్, బిపిస్ట్ టెస్టులు చేయడం జరిగింది. గ్రామాలలో శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను ఇచ్చి తప్పకుండా వాడాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి దేవ, పి హెచ్ ఎన్ చంద్రకళ,మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ శైలజ,రాంబాబు, ధరణి,ఇంద్రజ, అమూల్య, వీరభద్రమ్మ, లక్ష్మీ భాయ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మికాలనీలో ఆరోగ్య శిబిరం



**చర్ల, అక్టోబర్ 08(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం డాక్టర్ హారిక మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో లక్ష్మికాలనీ లోని డబల్ బెడ్ రూమ్ ప్రాంతంలో ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ ఆరోగ్య శిబిరం లో వివిధ చిరు వ్యాధులతో బాధపడుతున్న యాభై నాలుగు మందికి వైద్యం అందించారు .ఈ సందర్భగా డాక్టర్ హారిక మాట్లాడుతూ జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దని వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్ కి రావాలని అన్ని రకాల వ్యాధులకి మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు .బిపి షుగర్ ఉన్నవాళ్లు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని అలాగే వ్యాయామం లేదా వాకింగ్ చేయాలని తెలిపారు. అన్ని రకాల పరీక్షలు గవర్నమెంట్ హాస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయి కనుక పరీక్షలు చేయించుకోవాలని అన్నారు . అనంతరం కేజీబీవీ హాస్టల్ ను సందర్శించి విద్యార్థినులకు పరిసరాల పరిశుభ్రత ,వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్వైజర్ రాం ప్రసాద్,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తులసి,ఆశ కార్యకర్తలు రంగమ్మ,కృష్ణవేణి పాల్గొన్నారు.

## జెడ్ పి ఎస్ ఎస్ సి బయ్యారం పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డుల పంపిణీ



**పినపాక, అక్టోబర్ 08(ప్రజాజ్యోతి ):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పేద విద్యార్థులకు సహాయం అందిస్తున్న దాతలు అందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఈ బయ్యారం జిల్లా పరిషత్ పాఠశాల హెడ్మాస్టర్ నాగయ్య తెలిపారు. బుధవారం పాఠశాల విద్యార్థులకు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి మారంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు ఐడి కార్డులు బెల్టులు అందజేసినట్లుగా తెలియజేశారు. చదువుకున్న పాఠశాలపై ప్రేమతో ప్రవేట్ పాఠశాల విద్యార్థులకుదీటుగా ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు 20,000/-రూపాయల విలువ చేసే ఐడి కార్డులను బెల్ట్ లను అందజేసినట్టు తెలిపారు.విద్యార్థులు విద్యలో రాణించి మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాఠశాలఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి , వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న , ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ నాగయ్య



**పినపాక, అక్టోబర్ 08(ప్రజాజ్యోతి ):** పినపాక మండల పరిధిలోని వివిధ పాఠశాలలను పినపాక మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య తనిఖీ చేశారు. జడ్.పి. హెచ్.ఎస్ జానంపేట, యుపిఎస్ భూపతిరావుపేట, పిఎస్ ముకుందాపురం, పిఎస్ జానంపేట, యుపిఎస్ చేగర్షల, పిఎస్ రెడ్డిగూడెం , పిఎస్ దుగునేపల్లి పాఠశాలలను సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, ఉచిత యూనిఫామ్ పంపిణీ పరిశీలన, పాఠశాల తరగతి గది పర్యవేక్షణ, గ్రంథాలయ పుస్తకాల నిర్వహణ, ఎఫ్ఎల్ఎన్ వర్క్ సీడ్స్, ఎఫ్ఆర్ఎస్ నందు పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు తీరును పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ , సి ఆర్ పి ముఖేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సత్తా చాటాలని పిలుపు

- కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ(రూరల్ ),అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి ):** పాల్వంచ మండలం పరిధిలోని దంతెలబోర, ఎస్సీ కాలనీ, బంద్రుగొండ గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భం గా జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ కొత్వాల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని,గ్రామాల అభివృద్ధి కోసం స్థానికంగా కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎన్నిక కావాల్సిన అవసరం ఉందన్నారు.కార్యకర్తలు ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి జడ్పిటిసి,ఎంపీటీసీ,సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జాలే జానకి రెడ్డి,పెద్దమ్మతల్లి దేవాలయం ఛైర్మన్ బాలినేని నాగేశ్వరరావు,కాంగ్రెస్ నాయకులు ధర్మసోత్ ఉపేందర్ నాయక్,జమ్ముల రాజశేఖర్,మాజీ ఎంపీపీ కాక శ్రీనివాసరావు,దంతెలబోర మాజీ సర్పంచ్ బెల్లం అలివేలు,బోధ శ్రీలత రెడ్డి, గోసుల సతీష్,కొర్రయ్య, తెల్లం మల్లేష్,పోలేబోయిన వెంకటేశ్వర్లు,కంటే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం

- జగదాంబ సేన వ్యవస్థపాక అధ్యక్షులు రాములు నాయక్



**జూలూరుపాడు అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి ) :** జూలూరుపాడు మండల పరిధిలోని పడమట నరసాపురం లో ఉన్న జగదాంబ సేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు నాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో జగదాంబ మాతకు పూజలు చేశారు పూజలు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో హిందూ ధర్మాన్ని కాపాడాలని సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని హేతువాదులను తరిమికొట్టాలని హిందువులంతా ఏకం కావాలని హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని హిందువులందరికీ న్యాయం చేయాలని కోరారు జగదాంబ సేన జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పడమటి నర్సాపురంలోని జగదాంబ ఆలయ కమిటీ సభ్యులు వెంకట్రాం నాయక్ ను శాల్వతో సన్మానించిన అనంతరం జగదాంబ సేన సంఘం లో ఆహ్వానించారు.

## పత్తి రైతులు దళారుల మాటలు నమ్మొద్దు : కార్యదర్శి నరేష్



**టేకులపల్లి,అక్టోబర్08,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల పరిసర గ్రామాలలో పత్తి పంట సాగు చేస్తున్న రైతుల వారి చేను వద్దకు ఇల్లందు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ కార్యదర్శి నరేష్ బుధవారం పత్తి పంటను ఎలా అమ్ముకోవాలని అంశం పై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఐ కొనుగోలు కేంద్రం 25 -26 సంవత్సరం గాను ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల పట్టిను రైతులకు చూపిస్తూ అవగాహన కల్పించారు.ఎట్టి పరిస్థితిలోనూ మధ్యవర్తుల మాటల నమ్మి అరకొరకు రేట్లకు పత్తిని అమ్ముకొని రైతులు నష్టపోవద్దని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో యేసయ్య మార్కెట్ కమిటీ సూపర్వైజర్ ఎన్. శ్రీనివాసరావు,వై. మధు, జి. రంజిత్, ఎం. రవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ రోజు పెద్దమ్మగుడిలో హుండీ లెక్కింపు



**పాల్వంచ(రూరల్),అక్టోబర్ 08,(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో(తేదీ:అక్టోబర్, 09,2025,గురువారం) హుండీల లెక్కింపు జరగనుంది.దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపిన ప్రకారం,మే 29,2025 నుండి అక్టోబర్ 8,2025,వరకు భక్తులు మొక్కుబడిగా సమర్పించిన హుండీలలోని కానుకలను ఈ రోజు ఉదయం 8.00 గంటల నుండి ఆలయ ఆవరణలోని ఉచిత శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపం లో లెక్కించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం దేవస్థాన పాలకమండలి ఆధ్వర్యంలో జరుగనుందని,భక్తులకు విస్తృతంగా సమాచారం అందించేందుకు దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

## అయ్యప్ప స్వామి గుడిలో ప్రారంభమైన అయ్యప్ప మాల, ధారణలు





**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 8, ప్రజా జ్యోతి:** పాల్వంచ పట్టణంలోని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి మాల ధారణలు బుధవారం ప్రారంభమయ్యాయి, ఈ సందర్భంగా పట్టణానికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు సుమారు 75 మంది అయ్యప్ప స్వామి మాల ధారణలు చేసి దీక్ష చేపట్టారు, వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మాధవన్ నంబూద్రి స్వామి( గురు స్వామి) చేతుల మీదగా భక్తులు అయ్యప్ప దీక్ష చేపట్టారు.

## లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

- **గిరిజన విద్యార్థి సంఘం హెచ్చరిక**




**పాల్వంచ(రూరల్),అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పాల్వంచ ఎస్సై సుమన్ గారికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,లంబాడీ సమాజంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగితే ఇకపై సహించేది లేదని హెచ్చరించారు.లంబాడీల గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ అనిల్ నాయక్,లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ కుమార్,పాల్వంచ మండల అధ్యక్షుడు ఇస్లావత్ రాంబాబు నాయక్,మండల కో కన్వీనర్ బానోత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సిపిఎం అభ్యర్థులను గెలిపించండి: సిపిఎం పిలుపు



**పాల్వంచ(రూరల్),అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు మంగళవారం పాల్వంచ మండలం ఉలవనూరులో సిపిఎం కార్యకర్తల సమావేశం సర్ప నరేందర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ, రెండు సంవత్సరాలుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో గ్రామాలు అభివృద్ధి నుంచి వెనుకబడ్డాయని తెలిపారు. కోర్టు తీర్పుల మేరకు ఈ నెల 9 నుండి జడ్పిటిసి,ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందని చెప్పారు.అధికారాల లేమితో గ్రామాలు "మురికి కోపాలు"లా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని,ప్రజలకు నిజాయితీ పరిపాలన అందించగల శక్తి సిపిఎం కే ఉందని అన్నారు.అవినీతి రహిత పాలనకు,ప్రజా నిధుల సమర్థ వినియోగానికి సిపిఎం అభ్యర్థుల విజయం అవసరమని పిలుపునిచ్చారు.ప్రజల కోసం కాకుండా స్వార్థ ప్రయోజనాల కోసం పోటీ చేసే ఇతర పార్టీలు ప్రజల వనరులను దోచుకుంటున్నాయని ఆయన విమర్శించారు.రిజర్వేషన్ల పేరుతో మాఫియా ధోరణిలో పనిచేస్తున్న నాయకులను ప్రజలు తిరస్కరించాలని కోరారు.పాల్వంచ మండలంలో 5 ఎంపీటీసీ, 8 సర్పంచ్ స్థానాల్లో సిపిఎం పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండబోయిన వెంకటేశ్వర్లు, భద్రయ్య,వల్లపు వెంకన్న, నరసింహారావు, తాటి శ్రీను,గుగ్గల ముత్తయ్య,గొగ్గల వెంకన్న,గుర్రం వెంకన్న, రమేష్,జగన్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులు సమర్పించే చీరలపై రూ.50 రుసుము రద్దు చేయాలని భక్త సమాజం డిమాండ్

**పాల్వంచ (రూరల్), అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** పాల్వంచలో ప్రసిద్ధి చెందిన పెద్దమ్మతల్లి దేవాలయం భక్తుల విశ్వాసానికి,ఆధ్యాత్మిక శక్తికి కేంద్రంగా నిలుస్తోంది.ప్రతి రోజు దేశం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి చీరలు సమర్పిస్తూ తమ భక్తిభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల సంవత్సరాలుగా అమ్మవారికి సమర్పించే చీరలపై రూ.50 రుసుము వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ చర్య భక్తులలో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన భక్తులకు ఇది భారంగా మారిందని,చీర సమర్పణ అనేది పవిత్రమైన భక్తి చర్య మాత్రమే గాని ఆర్థిక లావాదేవీగా చూడకూడదని పాల్వంచ భక్త సమాజం పేర్కొంది.ఇప్పటికే అమ్మవారికి సమర్పించే చీరల టెండర్ ద్వారా దేవస్థానానికి ఆదాయం వస్తోందని,భక్తుల వద్ద నుండి అదనంగా రుసుము వసూలు చేయడం సమంజసం కాదని భక్తులు అభిప్రాయపడ్డారు.భక్తుల మనోభావాలను గౌరవిస్తూ,రూ.50 రుసుమును తక్షణమే రద్దు చేయాలని పాల్వంచ భక్త సమాజం దేవస్థాన అధికారులను కోరింది.ఈ నిర్ణయం తీసుకుంటే దేవస్థానం ప్రతిష్ఠ మరింత పెరగడమే కాకుండా,భక్తుల ఆశీస్సులు కూడా లభిస్తాయని వారు తెలిపారు.

## జస్టిస్ గవాయి పై జరిగిన దాడి కుట్ర పూరితమైన చర్య

- **అత్యున్నత స్థానంలో ఉన్న ప్రధాన న్యాయమూర్తి పై దాడి దుర్మార్గమైన చర్య**
- **మాల జన సమితి పినపాక నియోజకవర్గం అధ్యక్షులు చెట్టి సురేష్ డిమాండ్**



**అశ్వాపురం, అక్టోబర్ 8, ప్రజా జ్యోతి :** భారత దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్ర ధాన న్యాయమూర్తి జస్టిస్ సిజే బిఆర్ గవాయి పై జరిగిన దాడి కుట్ర పూరిత మైన, దాడిఅని దాడి చేసినవాడు ఎంతటి వాడు అయినా దేశద్రోహం క్రింద కేసులు నమోదు చేయాలని.. రాష్ట్రపతి ని ప్రమాణ స్వీకారం చేయించే ప్రధాన న్యాయమూర్తి, అలాంటి అత్యున్నత స్థానంలో ఉన్న న్యాయమూర్తి మీద జరిగిన దాడి రాజ్యాంగం మీద జరిగినట్లేనని, ఇలా దాడి జరిగితే యావత్ భారతదేశ ప్రజా ప్రతినిధులు ఖండించాల్సింది పోయి , ఒక్కరు కూడా నోరు మెదపడం లేదు.. రాష్ట్ర పతి, ప్రధాన మంత్రి,కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎంపీలు కనీసం ఏ ఒక్క రు కూడా ఈ చర్యను ఖండించడం లేదు... ఎందుకని?? ప్రజాస్వామ్యం మీద స్వ తంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడు జరగనంత అత్యంత నీచమైన హేయమైన దాడి ఇది, కానీ దీని పట్ల ఎవరు స్పందించకపోవడం చాలా బాధాకరం,, అంటే ఇలాంటి దాడులను ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తున్నారా ??? దీన్ని బట్టి ఆలోచిస్తే భారత రాజ్యాంగం ఎంత ప్రమాదంలో ఉందో అర్థమవుతుంది... దళిత మే ధావులారా ఆలోచన చేయండి.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కోసం దళితులంతా ఏకమై మరొక ఉద్యమం చేయాల్సిన పరిస్థితి ఈ దేశంలో ఏర్పడిందని మాల జన సమితి పినపాక నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్ తెలియజేశారు . దళిత నాయకులు చెట్టి మ ల్లేష్, జూపల్లి ధ్రువ కుమార్, ఎనోష్, కరకపల్లి డేవిడ్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం, అక్టోబరు 8,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి బుధవారం సందర్భంగా అంతరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకంను అర్చకులు నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకర్రబెల్లం మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.

## ఐటీడీఏ ఎదుట కొనసాగుతున్న డైలీ వేజ్ వర్కర్ల నిరసన




**భద్రాచలం, అక్టోబరు 3,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటీడీఏ ఎదుట డైలీవేజ్ వర్కర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొన సాగుతోంది. గత 27 రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూనియన్ జేఏసీ నాయకులు హీరాలాల్ కౌసల్యలు పేర్కొన్నారు.వారు వర్కర్లనుద్దేశించి మాట్లాడుతూ సమ్మెను మరింత ఉధృతం చేసేందుకు హైదరాబాద్లో రాష్ట్ర వ్యాప్త సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామ ని అన్నారు. కార్మికులు ఆధైర్యపడొద్దని, ప్రభుత్వం మనకు న్యాయం చేసేంత వరకు పోరాటం చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైలీవేజ్ వర్కర్ల యూనియన్ నాయకులు భద్రయ్య, దాసు, పాయం ముత్తయ్య, మంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.

## డిప్యూటీ సియంను కలిసిన ఎమ్మెల్యే

**ఇల్లందు, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్ లోని ప్రగతి భవన్ లో ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిదంగా మహబూబాబాద్ యంపి పోరిక బలరాం నాయక్ ను కలిసి స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితులపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గంలో ఐదు ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచేలా పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, నాయకులు ఇది గణేష్, సర్ధార్, కాంట్రాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.





# ట్రెండింగ్...
# రిజర్వేషన్...!

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

- బీసీ రిజర్వేషన్ల చుట్టూ రాజకీయ గందరగోళం
- హైకోర్టు తీర్పుపైనే రాష్ట్ర ఉత్కంఠ
- గవర్నర్ వద్దే నిలిచిన కీలక ఫైల్
- గోడగా మారిన 50 శాతం పరిమితి
- మహారాష్ట్ర ఉదంతం తెలంగాణకు హెచ్చరిక
- సుప్రీంకోర్టు సవాల్ కి దారితీసే నిర్ణయం
- న్యాయస్థానాల దిశే ఇప్పుడు భవితవ్యం
- దేశ, రాష్ట్ర రాజకీయాల హాట్ టాపిక్..
- ట్రెండింగ్ అంశం పై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం

**తెలంగాణలో ఇప్పుడు అత్యధికంగా వినిపిస్తున్న పదం "రిజర్వేషన్". రాష్ట్రంలో ఈ వివాదం రోజురోజుకీ ముదురుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అంచున నిలబడి ఉండగా, రిజర్వేషన్ లెక్కల గందరగోళమే ప్రభుత్వానికి ప్రధాన అడ్డంకిగా మారింది. హైకోర్టు తీర్పు కోసం రాష్ట్రం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వేళ, ఈ అంశం చుట్టూ మహారాష్ట్రలో గతంలో చోటుచేసుకున్న సంఘటనలు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి. దీంతో ప్రజా వేదికల నుండి పల్లె చాటువరకు ఒకే చర్చ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అవుతుందా ? సాధ్యమా? చట్టబద్ధమా? అని. ప్రస్తుతం ఈ అంశం కోర్టు, రాజ్ భవన్, ప్రభుత్వ భవనాలు, దేశ రాజకీయ వేదికలు అన్నింటినీ కదిలిస్తోంది. ఇప్పుడు ఇదే దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ట్రెండింగ్ టాపిక్గా మారింది. ఈ తరుణం లో ప్రజాజ్యోతి దీనిపై అందిస్తున్న విశ్లేషణాత్మకమైన కథనం.**

### రిజర్వేషన్ అంశానికి తొలి అడుగు..

'జనాభా మేరకు హక్కు – హక్కు మేరకు రిజర్వేషన్' అనే నినాదాన్ని కాంగ్రెస్ బలంగా సంకల్పించింది. అందులో భాగంగానే బీసీ వర్గాలకు వాటా ఆధారిత అంశాన్ని ఆ పార్టీ తెలంగాణాలో ఎన్నికల హామీగా కూడా నిలిపింది. ఇందుకోసం రాష్ట్రంలో ఉన్న బీసీ వర్గాల జనాభా, వారి ప్రాతినిధ్యం, సామాజిక ఆర్థిక స్థితి ఆధారంగా కొత్త రిజర్వేషన్ శాతాలను నిర్ధారించే ఫైల్ సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ మొత్తం దీనిని ఆమోదించి గవర్నర్ కు పంపించారు. అయితే గవర్నర్ కార్యాలయం ఆ ఫైలును వెంటనే ఆమోదించలేదు. కారణం – రాజ్యాంగ పరిమితుల ప్రకారం రిజర్వేషన్ మొత్తం 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు ఇంకా అమల్లో ఉండటమే. అదనంగా, కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా రాష్ట్రం తానే స్వయంగా శాతం పెంచడం రాజ్యాంగపరంగా సవాలు కావచ్చని గవర్నర్ భావించినట్లు సమాచారం. ఫలితంగా ఆ ఫైలు గవర్నర్ వద్దే నిలిచిపోయి, ఎన్నికల షెడ్యూల్ ముందు ఆమోదం రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ అమలు మరింత కాలయాపనకు గురైంది. దాంతోపాటు ఈ రిజర్వేషన్ అంశాన్ని కొందరు సవాలు చేస్తూ కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో ఈ అంశం పూర్తిగా కోర్టు పరిధిలోకి వెళ్లడం, అక్కడ న్యాయపరకమైన చిక్కులు ఉండడంతో ఇప్పటివరకు ఎలాంటి క్లారిటీ లేదు.




### న్యాయ పరమైన చిక్కులు..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించవచ్చు. అయితే 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఇంద్రసాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో మాండల్ కమిషన్ ఇచ్చిన తీర్పులో "మొత్తం రిజర్వేషన్ 50 శాతం మించకూడదు" అని స్పష్టం చేసింది. ఇది రాజ్యాంగ సమతుల్యతను కాపాడేందుకు అవసరమని కోర్టు పేర్కొంది. దాంతో కేంద్రం ఈ పరిమితిని ఇప్పటికీ కొనసాగిస్తోంది. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే రాష్ట్రాలు అదనపు శాతం కోరవచ్చని నిబంధన కూడా ఉంది. అందులో భాగంగానే ప్రస్తుతం తెలంగాణలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం (4 శాతం రాజ్యాంగ బద్ధంగా అమలులో లేదు), బీసీలకు 29 శాతం, ఎకానమికల్ వీకర్ సెక్షన్ కింద 10 శాతం రిజర్వేషన్ (ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో రాజ్యాంగ బద్ధంగా) మొత్తం 64 శాతం అవుతుంది. ఇప్పుడు బీసీలకు 42 శాతం వాటా ఇస్తే రిజర్వేషన్ మొత్తం 77 శాతాలకు పైగా చేరుతుంది. ఇది సుప్రీంకోర్టు నిర్దేశించిన పరిమితిని సుమారు 27 శాతం మించిపోతుంది. అందుకే ఈ పెంపుపై రాజ్యాంగపరమైన అనుమానాలు, న్యాయపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. దానిని అధిగమిస్తే తర్వాత అయిన చట్టబద్ధత సమస్య వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి మహారాష్ట్ర ఉదాంతాన్ని బూచిగా చూపిస్తున్నారు.

### ఏదేమైనా ప్రభుత్వానికి సవాల్ ..

ప్రస్తుతం తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశం కీలక మలుపులో ఉంది.

### మహారాష్ట్ర ఉదాంతం..

మహారాష్ట్రలో గతంలో ఇలాంటి పరిణామమే జరిగింది. 2018 నవంబరులో మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠా వర్గానికి 16 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసింది. ఆ చట్టం ఆధారంగా 2019లో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబడ్డాయి. కానీ రిజర్వేషన్ పరిమితి 50 శాతం దాటిందని కొందరి నుండి సవాళ్లు ఎదురయ్యాయి. బాంబే హైకోర్టు 2019 జూన్ 27న ఈ చట్టాన్ని పాక్షికంగా చెల్లుబాటు చేసినా, ఆ తీర్పును మరికొందరు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. చివరికి 2021 మే 5న సుప్రీంకోర్టు 5 గురి తో కూడిన రాజ్యాంగ బెంచ్ "మరాఠాలకు ఇచ్చిన రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం" అని స్పష్టం చేస్తూ ఆ చట్టాన్ని రద్దు చేసింది. ఎందుకంటే రాజ్యాంగంలోని 243డి, 243టి ఆర్టికల్స్ ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల మొత్తం శాతం 50% దాటకూడదు. దీంతో ఆ రిజర్వేషన్ ఆధారంగా అప్పటికే నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలు కూడా చట్టపరంగా నిలవలేవు అనే స్పష్టత వచ్చింది. ఈ పరిణామం వలన అక్కడి గ్రామపంచాయతీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు కూడా తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. ఈ ఉదంతం తెలంగాణకు ఇప్పుడు ఒక హెచ్చరికలాంటిది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే, మొత్తం రిజర్వేషన్లు 77 శాతానికి చేరతాయి. దీంతో ఇది అదే రాజ్యాంగ పరిమితిని దాటుతుంది. కాబట్టి మహారాష్ట్రలో జరిగిన పరిణామం మాదిరిగా ఇక్కడ కూడా ఎన్నికల తర్వాత చట్టపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని న్యాయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ అంశం తెలంగాణ ప్రభుత్వానికి సవాల్ గా మారింది.

హైకోర్టులో జరిగిన విచారణలో, నేటి నుండి అమలులోకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ను తక్షణం రద్దు చేయాలని కోరిన పిటిషన్ లను కోర్టు తిరస్కరించింది. అంటే ఎన్నికల ప్రక్రియను ఆపేంతవరకు ఆదేశాలు జారీ చేయలేదు. అయితే, రిజర్వేషన్ చట్టబద్ధతపై స్పష్టత వచ్చే వరకు తుది తీర్పు ఇవ్వకూడదని నిర్ణయించి, విచారణను నేటికి వాయిదా వేసింది. దీనితో, రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఊపిరి పీల్చుకున్నా, రాజకీయ అనిశ్చితి మాత్రం ఇంకా కొనసాగుతోంది. అయితే ఒకవేళ తెలంగాణ హైకోర్టు ప్రభుత్వం పక్షాన సానుకూల తీర్పు ఇచ్చినా.. అంటే బీసీ రిజర్వేషన్ల విధానం సరైనదే, చట్టబద్ధమే అని నిర్ణయించినా అది చివరి తీర్పు కాదని నిపుణులు అంటున్నారు. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశాలు పక్కా ఉన్నాయని వాళ్ళు అభిప్రాయపడుతున్నారు. మహారాష్ట్రలో అదే అంశంపై 2021లో సుప్రీంకోర్టు స్పష్టంగా "50% మించి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం" అని తీర్పు ఇచ్చింది. దాంతో అక్కడ ఇప్పటికే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు రద్దయ్యాయి, కొత్తగా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తలమునకలైంది. ఇప్పుడీ నేపథ్యంతో చూస్తే.. తెలంగాణలో కూడా హైకోర్టు తీర్పు ప్రభుత్వం పక్షాన వచ్చినా, సుప్రీంకోర్టులో రాజ్యాంగ పరిమితుల ఆధారంగా సవాలు చేస్తే అది కొత్త ఇబ్బందులు తెస్తుంది. ఎన్నికలు పూర్తి అయిన తరువాత కూడా ఆ ప్రక్రియను తాత్కాలిక నిలిపివేత (అబేయన్స్) లో పెట్టే అవకాశం ఉంటుంది. ఏదేమైనా న్యాయస్థానాల తీర్పు, ప్రభుత్వ పట్టుదల, ప్రజా వర్గాల ఆవశ్యకత.. ఈ మూడింటి మేళవింపుతో ఇప్పుడు ఈ బిసి రిజర్వేషన్ అంశం బాగా ట్రెండింగ్అవడంతో పాటు, తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందనే సంకేతాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

